క్లుప్తంగా

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి



ధనమ్మ తల్లి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మ తల్లి ఆలయానికి భక్తులు కిటకిటలాడారు. ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పర్యాటక కేంద్రం కావడంతో మండలంతో పాటు రావులపాలెం, కె.గంగవరం, అయినవిల్లి, అంబాజీపేట, కొత్తపేట తదితర మండలాల నుంచి పర్యాటకులు క్షేత్రాన్ని సందర్శించారు.

సీసీ రోడ్డు నిర్మాణంతో శాశ్వత పరిష్కారం



కోలంకలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: సీసీ రోడ్డు నిర్మాణాలతో గ్రామాల్లో రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కోలంకలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.16 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణాలకు మంత్రి సుభాష్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో మండల గ్రామాల్లో రూ.3.34 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల స్వప్న, ఎంపీడీఓ జె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వెలంపాలెంలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం, ద్రాక్షారామలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పాల్గొన్నారు. వెలంపాలెంలో రూ.23 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి కొబ్బరి కాయలు కొట్టి శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిర్మాణం పూర్తయిన శ్మశాన స్నానఘట్టం, విశ్రాంతి భవనం, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించారు. అనంతరం ద్రాక్షారామలో రూ.3.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు టేకుమూడి సుజాత, కొత్తపల్లి అరుణ, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, పంచాయతీరాజ్ ఏఈ యేసురత్నం తదితరుల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



తోటపేటలో ఆర్థికసాయం అందజేస్తున్న కాపు ఐక్య వేదిక నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటలో ఇటీవల మరణించిన దామిశెట్టి వీరబాబు కుటుంబానికి నియోజకవర్గ కాపు ఐక్య వేదిక సభ్యులు సమకూర్చిన రూ.1,10,000 ఆర్థిక సాయాన్ని ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మాగాపు అమ్మిరాజు, కంచెర్ల చక్రి, ఆళ్ల బుజ్జి, అల్లం రామకృష్ణ, అల్లం చంటి, మాధవరపు ప్రభాకర్, చెల్లూరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలు సద్వినియోగం చేసుకోవాలి

కె.గంగవరం: జిల్లా రెవెన్యూ ఆదేశాల మేరకు గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మృత్యుంజయరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో రీ సర్వే వల్ల రైతులకు ఏర్పడిన సమస్యలను తెలియడానికి వాటిని పరిష్కరించడానికి ఈ సభలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 21న తామరపల్లి, 22న యర్రపోతవరం, 23న యండగండి, 24న అద్దంపల్లి, 25న పామర్రు, 26న అముజూరు, 28న కె.గంగవరం, 29న కుందూరు, 30న పాణింగపల్లి, నవంబర్ 1న సత్యవాడ, 2న సుందరపల్లి, 4న ఊడిమూడి, 5న కుడుపూరు, 6న కూళ్ల, 7న బాలాంత్రం, 8న శివల, 11న గుడిగళ్ల, 12న గుడిగళ్లబాగ, భట్లపాలిక, 13న దంగేరు, 14న పేకేరు, కోటిపల్లి, 15న కోట ఆయా గ్రామాల్లోని పంచాయతీల వద్ద సభ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నేడు వల్లూరులో రెవెన్యూ గ్రామసభ

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో సోమవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ చిన్నారావు ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయంలో నిర్వహించే గ్రామసభకు రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారులు హాజరవుతారన్నారు. భూముల రీ సర్వేలో తలెత్తిన సమస్యలపై బాధితులు దరఖాస్తులను అందజేయవచ్చని నిర్ణీత గడువు లోగా సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయనున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

సీజనల్ వ్యాధుల విజృంభణ

- వైరల్, టైఫాయిడ్, డెంగీ బాధితులు అధికం
- ప్రభుత్వ ఆసుపత్రులకు పెరిగిన రోగులు



రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



ద్రాక్షారామలో రోడ్డు పక్కనే వదిలేసిన తాగేసిన కొబ్బరి బొండాలు, వ్యర్థాలు

రామచంద్రపురం: వర్షాకాలం నుంచి శీతాకాలం మారుతున్న వేళ సీజనల్ వ్యాధులు మరింతగా విజృంభిస్తున్నాయి. ఎవరిని కదిపినా జ్వరం, ఎక్కడ చూసినా కీళ్ల నొప్పులు, టైఫాయిడ్ అంటూ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఇవే ప్రస్తుతం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పారిశుధ్య లోపంతో ప్రజలకు వైరల్ ఫీవర్లు, టైఫాయిడ్, డెంగీల బారిన పడుతున్నారు. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులతో రోజురోజుకూ జ్వరపీడితుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. అప్పుడే వర్షపు జల్లులు, మరి కొద్దిసేపటికే తీవ్రమైన వేడిమితో ఎండ ఇలా వర్షంలో తడిచి వెంటనే ఎండలో ఎండుతున్న వారు వెంటనే జర్వపీడితులుగా మారిపోతున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రితో పాటుగా నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు జర్వం బారిన పడిన రోగులతో కిక్కిరిసిపోతున్నాయి.

క్షీణించిన పారిశుధ్యం

వైరల్, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు ప్రధానంగా పారిశుధ్యం క్షీణించడమేనని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలం కావటంతో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం అధికంగా ఉంటూ దుర్గంధం వ్యాపిస్తుంది. మురుగునీరు కలుషితమై రోడ్లు మీదకు రావటంతో దోమలు విజృంభిస్తున్నాయి. తాగునీరు కూడా కలుషితం కావటంతో జ్వరం వస్తే చాలు టైఫాయిడ్ వచ్చేస్తుంది. నియోజకవర్గంలోని మండల గ్రామాల్లో రోడ్ల పక్కనే చెత్తను వేయటంతో దుర్గంధం వ్యాప్తి చెంది జ్వరపీడితులు పెరుగుతున్నారు. మండల గ్రామాల శివార్లలోను, రోడ్డు పక్కన తాగేసిన కొబ్బరి బొండాలను పడేస్తున్నారు. వాటిల్లో నీరు చేరి దోమలు విజృంభించి గ్రామాల్లో రోగులు పెరుగుతున్నారు. ప్రతి గ్రామంలోని నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటుతో స్వచ్ఛమైన నీరు లేకపోవటంతో వ్యాధులకు కారణంగా అధికారులు, వైద్యులు చెబుతున్నారు. రోడ్ల పక్కన ఉండే చెత్త తీవ్రంగా ప్రభావం చూపుతుంది. గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేకపోవటం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. వెరసి ప్రస్తుతం జ్వరపీడితుల సంఖ్య మరింతగా పెరుగుతుంది.

పెరుగుతున్న ఓపీ

రామచంద్రపురం ఏరియా ఆసుప్రతిలో ప్రతి రోజు సామాన్య రోజుల్లో 450 నుంచి 500 వరకు అవుట్ పేషెంట్లు వస్తుంటారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు కాలం కావటంతో ఆ సంఖ్య 550 వరకు పెరుగుతుంది. గతంలో ప్రతి రోజు 15 మంది వరకు జ్వరపీడితులు వస్తుంటే ప్రస్తుతం ఆ సంఖ్య 25 నుంచి 40 వరకు పెరుగుతుంది. స్థానిక ఏరియా ఆసుపత్రిలో జర్వం బారిన పడిన వారి ఇన్ పేషెంట్లుగా ఆసుపత్రిలో సుమారుగా 25 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరిలో అధికంగా టైఫాయిడ్, వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న వారే.. కాగా నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం రూరల్, కాజులూరు, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండల గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆయా మండలాల్లోని పీహెచ్‌సీలకు జర్వపీడితులు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలతో పాటుగా, ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఇదే పరిస్థితి.

అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండటంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. అపారిశుధ్యంతోనే ఈ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రధానంగా తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో దోమలు చేరి పెరుగుతున్నాయి. ఇవి చాలా ప్రమాదకరం, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన వేడినీళ్లను తీసుకోవాలి. బయట ఆహార వస్తువులు తీసుకోకుండా వేడి ఆహారాన్ని తీసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారవచ్చు. వైద్యుల సలహాలు పాటించాలి. ఏరియా ఆసుపత్రికి వచ్చే జర్వపీడితులను 24 గంటలు పాటు పర్యవేక్షిస్తున్నాం. ఆసుపత్రిలోనే రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచుతున్నాం. – డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి రామచంద్రపురం

ప్రజారోగ్య పరిరక్షణకు పీఎంపీలు దోహదపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కేఎస్ఎన్ బాబు

కాజులూరు: గ్రామాల్లో ప్రజారోగ్య పరిరక్షణకు పీఎంపీలు దోహదపడాలని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కేఎస్ఎన్ బాబు అన్నారు. ఆదివారం గొల్లపాలెంలోని కమ్యూనిటీ పారామెడికల్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ (పీఎంపీ అసోసియేషన్) భవనంలో కాజులూరు, కరప మండల యూనిట్ అధ్యక్షుడు జేవీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యులకు వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ అరుణ హాస్పిటల్ అధినేత డాక్టర్ చవ్వాకుల శేషగిరిరావు, చవ్వాకుల హిమబిందు, ప్రముఖ న్యూరోసర్జన్ బి.రాజాగోపికృష్ణ, నూకల బలరాం తదితరులు పాల్గొని పలు రకాల వ్యాధుల లక్షణాలు, వ్యాధులకు గురైన రోగులను ఆసుపత్రికి చేర్చేముందు పీఎంపీలు చేపట్టాల్సిన ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి మట్టా వీరబాబు, మండల కార్యదర్శి ఆర్.వినయ్‌కుమార్, మండల కోశాధికారి పీఎల్ శ్రీనుబాబు, కాకినాడ టౌన్, యానం అధ్యక్షుడు సీహెచ్ ఏడుకొండలు, సీహెచ్ శ్రీనివాసు, తాళ్లరేవు మండల కార్యదర్శి షేక్ రెహమాన్, జిల్లాలోని పలు మండలాలకు చెందిన నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ ఏదీ?



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాబా

మండపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ ఎక్కడుందని షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా ప్రశ్నించారు. స్థానిక విజయలక్ష్మీ నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థినులకు, చిన్నారుల మానప్రాణాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. కడప జిల్లా బద్వేల్ పట్టణంలో ఇంటర్ విద్యార్థినిని ప్రేమోన్మాది అత్యాచారం చేసి ఆపై పెట్రోలు పోసి హతమార్చిన ఘటనపై అలీఖాన్‌బాబా స్పందించారు. కర్నూలు జిల్లా అస్పరి మండలంలో ఇంటర్ విద్యార్థినిపై ప్రేమోన్మాది జరిపిన ఘాతుకం మరువకుండానే కడప జిల్లాలో ఇంటర్ విద్యార్థిని బలైపోయిందన్నారు. మహిళ హోం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఘటన జరిగి 24 గంటలు గడుస్తున్నా బాధిత కుటుంబాన్ని హోం మంత్రి అనిత గానీ, ఇతర ప్రభుత్వ ప్రతినిధులు గాని వెళ్లి పరామర్శించక పోవడం బాధాకరమన్నారు. ఇంటర్ విద్యార్థిని అత్యాచార ఘటనపై గవర్నర్ జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రథం గుడిలో లక్ష్మీ గణపతికి గరిక పూజ



లక్ష్మీ గణపతికి గరిక పూజ నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వర శర్మ

మండపేట: సంకట హర చతుర్థి పర్వదినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని రథం ఆలయంలోని లక్ష్మీగణపతి స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకుడు అయినవిల్లి సూర్య సుబ్రహ్మణ్యేశ్వర శర్మ స్వామివారికి తెల్లవారుజామున పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం గరికతో పూజాదికాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి వారిపై వివిధ రకాల పూలతో ఓంకారం తీర్చిదిద్దారు. పట్టణ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ఏటిగట్టుపై ప్రమాదకరంగా ఉన్న వంతెన

కె.గంగవరం: అసలే ఏటిగట్టు ఇరుకు. దీనిపై ఉన్న వంతెన మరీ ఇరుకు. దీనికి తోడు వంతెనకు ఇరువైపులా మలుపులతో ప్రమాదకరంగా మారిందని ప్రయాణీకులు అంటున్నారు. మండలంలోని కోటిపల్లి– కోట ఏటిగట్టుపై ఉన్న ఈ వంతెన వద్ద గత రెండు నెలలుగా పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిపాలయ్యారని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల రాజమహేంద్రవరానికి చెందిన యువకుడు వంతెనకు ఢీ కొని మృతి చెందాడు. గత నెలలో ఇద్దరు వ్యక్తులు వంతెన వద్ద మలుపు గమనించకపోవడంతో కాలువలోకి దూసుకెళ్లి మృతి చెందారు. ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా కనీసం ఈ వంతెన వద్ద ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ప్రయాణీకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

మందుబాబుల ఆగడాలతో ఇక్కట్లు



బురుగుంట చెరువు వైఎస్సార్ పార్కులో మద్యం తాగి పడుకున్న వ్యక్తి

మండపేట: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మద్యం పాలసీలో భాగంగా ఊరువాడా మద్యం దుకాణాలు వెలిశాయి. గత ప్రభుత్వంలో ఊరికి దూరంగాను, జన సంచారం అంతగా లేని ప్రాంతాల్లోనూ మద్యం దుకాణాలు ఉండేవి. మండపేట పట్టణంలో వైన్ షాపులు జన సామర్థ్యం ఎక్కువగా వుండే ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ ప్రజలకు లేనిపోని చిక్కులు మొదలయ్యాయి. ప్రశాంతంగా ఉండే పట్టణంలో జనావాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మందుబాబుల చేష్టలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం బురుగుంట చెరువు వైఎస్సార్ పార్క్ వద్ద ఉన్న ఓ దుకాణంలో మద్యం తీసుకుని ఓ వ్యక్తి పీకల దాకా తాగి పక్కనే పార్కులో గంతులు వేశాడు. మందు బాబు చేసిన రాద్ధాంతానికి సాయంత్రం పార్క్‌కు వచ్చే సందర్శకులు, వాకర్స్ ఇబ్బందులు పడ్డారు. ఇంకా ఇలాంటి చిందులు ఎన్ని చూడాల్సి వస్తుందో నంటూ ప్రజలు చెవులు కొరుక్కోవడం గమనార్హం.

కబడ్డీ పోటీల విజేత ఐడియల్ కళాశాల జట్టు



సౌత్ జోన్ కబడ్డీ చాంపియన్ షిప్‌లో పాల్గొనే నన్నయ యూనివర్సిటీ జట్టుతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

మండపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో శని,ఆదివారాలు నిర్వహించిన అదికవి నన్నయ్య యూనివర్శిటీ అంతర కళాశాలల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. కాకినాడ ఐడియల్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. కాకినాడ పీఆర్ కళాశాల జట్టు ద్వితీయ, మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు తృతీయ స్థానంలోనూ నిలిచాయి. ఈ నెల 30న చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే నన్నయ యూనివర్సిటీ కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టులో 16 మంది సభ్యులు ఉన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మండపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు, పీడీ ఎస్. వీరాంజనేయులు, అధ్యాపకులు దిలీప్, రాజేష్ పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పిల్లాపాపలతో స్వామి వారిని దర్శనానికి తరలి వచ్చారు. ఆలయంలో నిర్వహించిన నారసింహ సుదర్శన హోమంలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. సుమారు 4 వేల మంది సాధారణ, ప్రత్యేక దర్శనాల ద్వారా స్వామిని దర్శించుకున్నట్టు దేవస్థానం తెలిపింది. దర్శనం అనంతరం భక్తులకు నిత్యాన్నదానంలో భోజన సౌకర్యం దేవస్థానం సిబ్బంది కల్పించారు. భక్తుల భోజన వసతిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

నవీకరణతో పథకాలకు అర్హత

- చిన్నారుల బయో మెట్రిక్ ఒక్కసారైనా నవీకరించుకోవాలి
- చేసుకోనివారికి సచివాలయాల్లో నవీకరణ నదుపాయం
- వేలిముద్రలు, చిరునామా, పుట్టిన తేదీ మార్పుల సమస్యల పరిష్కారం
- నేటి నుంచి 25 వరకూ ప్రత్యేక శిబిరాలు



వల్లూరు సచివాలయంలో ఆధార్ నవీకరణ చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ దొరబాబు (ఫైల్)

కపిలేశ్వరపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందేందుకు లబ్ధిదారుల వివరాలు పక్కాగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆధునిక కాలంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న నేపథ్యంలో లబ్ధిదారుని వివరాలు సైతం ఆన్‌లైన్‌లో సక్రమంగా ఉండడం తప్పనిసరి. ప్రభుత్వ లబ్ధికి ఎలాంటి సాంకేతిక సమస్యలు అడ్డు కాకూడదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సోమవారం నుంచి 25వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు నిర్వహిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ ఈ ప్రక్రియకు తోడ్పాటు ఇస్తోంది. 2023 అక్టోబర్, 2024 ఆగస్టులలో దశలవారీగా నవీకరణ కేంద్రాలను పెంచుకుంటూ నవీకరణ ప్రక్రియను వేగవంతం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సోమవారం నుంచి 25 వరకూ మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

ఎందుకోసమంటే..

పదేళ్ల క్రితం ఆధార్ చేయించుకున్న వారి వివరాల్లో మార్పులు ఉండటమూ, వేలిముద్రలు పడక పోవడమూ, గతంలో ఆధార్ చేసినపుడు వివరాలు తప్పుగా నమోదు కావడం జరిగి ఉండొచ్చు. వాటి వల్ల ప్రభుత్వ పథకాలను పొందడంలో తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నవీకరణ చేసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నాయి. వేలిముద్రలు, ఐరిష్, ఫొటో, వయస్సు, ఇంటి అడ్రస్ తదితర వివరాలను నవీకరించుకోవాల్సి ఉంది.

ప్రత్యేక శిబిరాలిలా..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో మండలానికి రెండు శిబిరాల చొప్పున నాలుగు రోజుల పాటు శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు నవీకరణ చేస్తారు. మండల కేంద్రమైన రాయవరం -2, సోమేశ్వరం సచివాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటలకు నవీకరణ కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. 22న వెదురుపాక సచివాలయంలోనూ సేవలందించనున్నారు. కపిలేశ్వరపురం మండలంలో 22,23 తేదీల్లో తాతపూడి, కోరుమిల్లి, వడ్లమూరు, 24, 25లలో పడమర ఖండ్రిక, కాలేరు, నేలటూరు సచివాలయాల్లోనూ శిబిరాలను నిర్వహిస్తున్నారు.

ఆధార్ కార్డుల నేపథ్యమిలా..

తొలిసారిగా 2011లో కేంద్ర ప్రభుత్వం కార్డులను జారీ చేసింది. అప్పటి నుంచి నవీకరణ పెద్ద సమస్యగా ఉండేది. పన్నెండేళ్లకు ఒకసారి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆమేరకు 2010–2016 లోపు ఆధార్ పొంది, అప్పటి నుంచి నవీకరణ చేసుకోనివారి కోసం గతంలో పలుమార్లు ప్రత్యేక శిబిరాల్లో నవీకరణ అవకాశం కల్పించింది. ఈసారి శిబిరాల ప్రధాన లక్ష్యం చిన్నారుల బయోమెట్రిక్ వివరాలను నవీకరించడం. 5–7 సంవత్సరాల మధ్య గల చిన్నారుల వేలిముద్రలను ప్రస్తుత శిబిరాల్లో ఉచితంగా నవీకరించనున్నారు. 15–17 మధ్య వయస్సుగల వారి బయోమెట్రిక్ వివరాలను సైతం ఉచితంగా నవీకరిస్తారు.

ప్రక్రియ ఇలా..

ఆధార్ కార్డుల జారీ సంస్థ యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఐ) సంస్థ నవీకరణకు నిబంధనలు విడుదల చేసింది. ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలనుకునే వారు సమీపంలో ఆధార్ నవీకరణ సేవలందిస్తున్న సచివాలయ కేంద్రానికి వెళ్లాలి. పుట్టిన తేదీని సరిచేసుకునేందుకు రుజువుగా పదో తరగతి మెమో, పాస్‌పోర్టు, పాన్ కార్డులను అప్‌లోడ్ చేయాలి. చిరునామా మార్పు కోసం బ్యాంక్ ఖాతా, పోస్టాఫీసు ఖాతా, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు అప్‌లోడ్ చేయాలి. చిన్నారులకు వారి తల్లిదండ్రుల వేలిముద్రలతో కార్డు జారీ చేస్తారు. ఐదేళ్ళు పూర్తయిన తర్వాత మాత్రమే పిల్లల వేలిముద్రలు, ఫొటో అప్‌డేట్ చేస్తారు. తొలిసారి ఆధార్ చేసుకునే పిల్లలకు ఉచితంగా చేస్తారు.

కేశవరంలో బీజేపీ సభ్యత్వాల నమోదు

మండపేట: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండపేట పట్టణంలోను, మండలంలోను జోరుగా సాగుతున్నట్టు ఆ పార్టీ మండపేట నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సాయిరామ్ తెలిపారు. బీజేపీ రాష్ట్రశాఖ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాయకులంతా కృషి చేస్తున్నామని చెప్పారు. ఆదివారం మండలంలోని కేశవరంలో సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. గ్రామంలోని 1, 2 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రజలను కలుసుకుని కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ పార్టీ సభ్యత్వాలు చేయిస్తున్నామని వివరించారు. 48 సభ్యత్వాలు చేసామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, పార్టీ నాయకుడు మర్రి రామచంద్రరావు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

కపిలేశ్వరపురం మండలం

దొరరాజు	సీఐ,మండపేట రూరల్	9440796537
డి.రవికుమార్	ఎస్సై, అంగర పోలీస్ స్టేషన్	9440900770
సాయి చంద్రిక	ఏఈ డ్రైయిన్స్, రామచంద్రపురం	8886066939
వై.వెంకటేశ్వరరావు	డిప్యూటీ ఈఈ, ఆర్అండ్ బీ, రామచంద్రపురం	9440818285
వి.వెంకటరమణ	ఏఈ, ఆర్అండ్‌బీ, మండపేట సబ్ డివిజన్	9440818537
జి.దుర్గాప్రసాద్	ఏపీఎం, ఐకేపీ	9652304198
డేవిడ్‌రాజు	ఎఫ్‌డీఓ, మత్స్యశాఖ	9948029350
కె.రవికిరణ్	ఏపీఓ, ఎన్ఆర్ఈజీఎస్	7702072981
డీవీ రాఘవులు	మండల ఇంజినీరింగ్ అధికారి	9966526720
కామేశ్వరరావ	ఎండోమెంట్ అధికారి	9908792945
భాస్కరరావు	మేనేజర్, ఆర్టీసీ, ఆర్సీపురం డిపో	7382825536
కేడీఎస్ఎస్‌కుమార్	మేనేజర్, ఆర్టీసీ, రావలపాలెం డిపో	9959225537
వెంకటేశ్వరరావు	ఏఎస్‌డబ్ల్యూఓ, సోషల్ వెల్ఫేర్	9492168780
కె.శివనాగమల్లేశ్వరరావు	కార్మికశాఖ అధికారి	9492555059
డీఎస్ఎన్ మూర్తి	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్	9849352664
నాగేశ్వరరావు	ఎక్సైజ్ సీఐ ఆలమూరు	9701287828
కోటేశ్వరరావు	ఉద్యాన శాఖాధికారి	8712625210